మినీ కథ

# చూపు

పేరంటానికి వెళ్ళింది సీత.

అక్కడ చాలామంది ఆడవాళ్ళు రంగు రంగుల కొత్త చీరలతో కళకళలాడిపోతున్నారు. వారిలో కొంద రామెకు తెలిసినవా రున్నారు.

రాగానే ఇంటావిడ సీత కాళ్ళకు పసుపు రాసింది. తరువాత సీత తన స్నేహ బృందంతో కలిసిపోయింది. సినిమాలు, నవలలు, వంటలు—కబుర్లు కాలాన్ని పరిగెట్టిస్తున్నాయి. కిలకిల నవ్వులు ఆ వాతావరణంలో సుహృద్భావాన్ని నింపుకున్నాయి.

అలాంటి సమయంలో—ఉన్నట్టుండి అందరి నవ్వులూ ఆగిపోయాయి. వాతావరణం నిశ్శబ్దంగా మారిపోయింది.

గుమ్మంలో ఓ కొత్త మనిషి. ఖరీదైన పట్టుచీరలో నిండైన విగ్రహం...

ఇంటావిడ ఆమెకు ఎదురెళ్ళి—"రండి రండి!" అంటూ ఆహ్వానించింది. ఆమె మహారాణి ఠీవితో లోపలికి అడుగు పెట్టింది.

అక్కడ చేరిన ఒక్కొక్కరే ఆమెకు చేతులు జోడిస్తున్నారు. పతాక వందనం స్వీకరిస్తున్న దేశాధినేతలా ఆమె నెమ్మదిగా అడుగు తీసి అడుగు వేస్తోంది.

ఆమె ఎవరో సీతకు తెలియదు. ఎవరని అడగాలంటే ఆ వాతావరణంలోని నిశ్శబ్దాన్ని భంగం చేస్తానని భయం. ఆ పరిస్థితిలో సీత భయంతో తనూ రెండు చేతులు జోడించి నమస్కారం పెట్టింది. ఆ మహారాణి సీతవైపు కన్నెత్తయినా చూడలేదు. ఆమె చూపే మహాభాగ్య మన్నట్టుగా అంతా ఎదురు చూస్తున్నారు. ఆమె తనవైపు చూడనందుకు సీత మనసు చివుక్కుమంది.

కాసేపటికి వాతావరణంలో కొంత మార్పు వచ్చింది. నిశ్శబ్దం గుసగుసల స్థాయికి చేరుకుంది. అప్పుడు సీత కా మహారాణి ఎవరో తెలిసింది.

ఆమె కలెక్టరుగారి సతీమణి. ఆ ఊళ్ళో ఎన్నో సాంఘిక సేవా సంస్థల్లో ఆమెకు గౌరవ స్థానముంది. తనకున్న సమయంలో వీలు చూసుకుని పేరంటానికి ఆమె వచ్చిందంటే అదో పెద్ద విశేషం. ఆమె అందరిళ్ళకూ పేరంటానికి రాదు. ఆమె వస్తుందని తెలిసే ఈ పేరంటానికి ఎక్కువమంది వచ్చారు.

"ఆమె వల్ల మనకేం ప్రయోజనం?" అంది సీత.

ఈ ప్రశ్నకు జవాబు లేదు. అందుకే సీతకు జవాబు రాలేదు.

"మనం దణ్ణం పెడితే కనీసం మనవంకైనా చూడదేం?" అంది సీత.

"దణ్ణం పెట్టడం మనవంతు. చూడాల్సిన అవసర మామెకు లేదు."

ఆ పేరంటం అలాగైపోయింది.

తరువాత నెల రోజులకు మళ్ళీ ఎవరింట్లోనో పేరంటానికి పిలుపొచ్చింది సీతకు.

"కలెక్టరుగారి సతీమణి వస్తుందా?" అడిగింది సీత.

పిలిచినావిడ స్వరం తగ్గించి—"ఆవిడకోసమే పేరంటం రోజు కూడా మార్చుకున్నాను" అంది.

"అదెలా సాధ్యం?" అంది సీత ఆశ్చర్యంగా.

"పేరంటాని కావిడ రావడం ముఖ్యంగానీ ముహూర్తం కాదు."

సీత పేరంటానికి వెళ్ళింది. మళ్ళీ అదే వాతావరణం. అంతా ఉత్సాహంగా కబుర్లు చెప్పుకుంటున్న సమయంలో—వాతావరణం ఉన్నట్లుండి నిశ్శబ్దంగా మారిపోయింది.

కలెక్టరుగారి సతీమణి ప్రవేశించింది. పతాక వందనం స్వీకరిస్తున్న దేశాధినేతలా ఆమె నెమ్మదిగా అడుగు తీసి అడుగు వేస్తూ సీతను దాటి ముందుకు వెడుతూ చటుక్కున ఆగి, పక్కకు తిరిగి సీతను చూసింది.

సీత చూపు ఆమె చూపులతో కలిసింది.

కలెక్టరుగారి సతీమణి ముందుకు వెళ్ళాక—వాతావరణంలోని నిశ్శబ్దం గుసగుసల స్థాయిని చేరుకున్నాక, సీత పక్కనున్నామె—"కలెక్టరుగారి సతీమణి నిన్ను ప్రత్యేకంగా చూసింది. ఆశ్చర్యంగా లేదూ?" అంది.

"ఆశ్చర్యం లేదు. ఆమె నన్ను చూస్తుందని ముందే తెలుసు నాకు" అంది సీత.

"ఎలా?"

"నే నామెకు దణ్ణం పెట్టలేదు!"

—వసుంధర


## రీజనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీషు

జ్ఞాన భారతి, బెంగుళూరు - 560 056

### ఇంగ్లీషులో కరస్పాండెన్స్ - కమ్ - కాంటాక్ట్ కోర్సులు

1. డిప్లమో ఇన్ టీచింగ్ ఇంగ్లీషు — 1 సంవత్సరం
2. ప్రొఫిషియెన్సీ కోర్సు ఇన్ ఇంగ్లీషు — "
3. ప్రొఫిషియెన్సీ ఇన్ స్పోకెన్ ఇంగ్లీషు — 6 నెలలు

అర్హత : కోర్సు 1. ఆర్ఐఇ సర్టిఫికెట్ కోర్సు లేదా తత్సమానమైన కోర్సులో శిక్షణ పొందిన సెకండరీ స్కూలు టీచర్లు.

కోర్సు 2 ప్రైమరీ / అప్పర్ ప్రైమరీ టీచర్లు (పట్టభద్రులు కానివారు మాత్రమే) ఉద్యోగస్తులైన, పట్టభద్రులు కాని ఇతరులు.

కోర్సు : 3 ఎస్ఎస్ఎల్‌సి మరియు ఆపైన

డైరెక్టర్, ఆర్ఐఇ పేర్న, జ్ఞాన భారతి పి.ఓ బెంగుళూరు - 560 056 వద్ద నగదువరుచుకొనే విధంగా రూ. 5/- ల క్రాస్ చేసిన పోస్టలు ఆర్డరును పంపించి కోర్సు బులిటెన్ మరియు దరఖాస్తు ఫారములు పొందవచ్చును.

దరఖాస్తు ఫారం అభ్యర్థనకు ఆఖరు తేది — 30 మే 1987

దరఖాస్తు పంపుటకు ఆఖరు తేది — 15 జూన్ 1987

### ఫ్యాకల్టీ ఖాళీలు

ఫ్యాకల్టీలో ఇప్పుడు ఉన్న కొన్ని ఖాళీలను సంస్థ భర్తీ చేయుచున్నది. ఇంగ్లీషులో టీచర్ ట్రైనింగ్ అర్హతలతో మరియు ఎమ్. ఎ ఇంగ్లీషు ప్రథమ / ద్వితీయ శ్రేణితో దక్షిణాది రాష్ట్రాలలోని స్కూల్స్/ కాలేజీలలో పని చేయుచున్న వారు డైరెక్టర్, ఆర్ఐఇ, బెంగుళూరుకు ఒక అడ్వాన్సు కాపీతో ప్రావర్ చానల్ ద్వారా దరఖాస్తు చేయవలెను. ఇంగ్లీషు లాంగ్వేజి స్టడీస్ / టీచర్ ట్రైనింగ్‌లో ఎమ్.లిట్/ ఎమ్ ఫిల్ / పి హెచ్.డి వంటి హెచ్చు అర్హతలు గల వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.